నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 2 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

ఎల్ ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం

- కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : జిల్లావ్యాప్తంగా భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పంచాయతీ, నీటిపారుదల, రెవెన్యూశాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొబైల్ యాప్ ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ నిర్వహించాలని, నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. నీటిపారుదలశాఖ అధికారులు, ఆయాశాఖల సిబ్బందికి దరఖాస్తుల స్క్రూట్నీ కోసం ప్రతిరోజు లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. నీటిపారుదలశాఖ పరిధిలో తనిఖీల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో నీటి వనరులు బఫర్ జోన్, ఎఫ్టీఏలో ఉండవద్దన్నారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ సమయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. టీపీవోలు, పంచాయతీ సెక్రటరీలు ముందుగా లొకేషన్‌ను గుర్తించాలన్నారు. ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు సూచించారు. జిల్లాలోని వివిధగ్రామాల్లో తక్కువ సంఖ్యలో ఉన్న దరఖాస్తులను రెండ్రోజుల్లో పూర్తిచేయాలని ఆర్డీవోలు మధు, దామోదర్‌రావును ఆదేశించారు.

'ఎల్ ఆర్ఎస్' పెండింగ్‌లో ఉండొద్దు

- అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను చేరుకోవాలి
- వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మం, మార్చి 1 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నెలాఖరులోగా స్క్రూట్నీ పూర్తి చేసి పెండింగ్ లేకుండా పరిష్కరించేలా చూడాలని అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎల్ఆర్ఎస్‌పై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్లు శనివారం వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తుల స్క్రూట్నీ కోసం అవసరమైన మేర బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి బృందంలో నీటిపారుదల శాఖ, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, సంబంధిత అధికారులు ఉండాలన్నారు. ప్రతి రోజూ ఎన్ని దరఖాస్తుల స్క్రూట్నీ జరుగుతుందో లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. భూ క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వ భూములు, నీటివనరుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో క్రమబద్ధీకరణకు అనుమతించొద్దని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే ధ్రువీకరణ చేయాలని సూచించారు. భూ క్రమబద్ధీకరణ విషయంలో ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్ఆర్ఎస్ స్క్రూట్నీ పూర్తి చేసుకుని ఆమోదించిన దరఖాస్తుదారులను ఫాలో అప్ చేస్తూ మార్చి 31వ తేదీలోపు ప్రభుత్వం అందించే రాయితీ వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం మండలాలవారీగా అదనపు కలెక్టర్లు సమీక్షించి.. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యల గురించి వివరించడంతో పాటు సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో డీపీవో ఆశాలత, డీఎల్పీవో రాంబాబు, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నీటిపారుదల శాఖ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, మార్చి 1 : విద్యార్థుల ఆరోగ్యం విషయంలో హెచ్ఎంలు, వార్డెన్లు, ఏఎన్ఎంలు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ హెచ్చరించారు. పట్టణంలోని బీఈడీ కళాశాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని హెచ్ఎం, వార్డెన్, ఏఎన్ఎంలతో వృత్యంతర శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎంలు పని చేస్తున్న చోటే నివాసం ఉంటూ పిల్లల ఆరోగ్య స్థితిగతులను గమనిస్తుండాలని అన్నారు. అనారోగ్యంతో బాధపడే విద్యార్థులను గుర్తించి దగ్గర్లోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించాలని సూచించారు. మీ పరిధి పీహెచ్‌సీల్లోని వైద్యులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, హెచ్ ఈవోలతో సమన్వయంగా ఉంటూ ప్రతి నెలా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. కిశోర బాలికలకు అవసరమైన వైద్య పరీక్షలు మహిళా వైద్యులచే చేయించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి చదువుతోపాటు వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చూసే బాధ్యత హెచ్ఎం, వార్డెన్‌లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ మణెమ్మ, విజయలక్ష్మి, ఏసీఎంవో రమణయ్య, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరూనాయక్, వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో చైతన్య, ఏటీడీవోలు పాల్గొన్నారు.

ఖమ్మం 57వ డివిజన్‌లో ప్రభుత్వ భూములపై కబంధహస్తం

- ఖమ్మం 57వ డివిజన్‌లో దర్జాగా కబ్జా
- ఆక్రమణకు పాల్పడిన స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్ భర్త
- వెలుగులోకి తెచ్చిన బీఆర్ఎస్ నాయకుడు
- స్థలాలను పరిశీలించిన ఆర్డీవో, తహసీల్దార్
- కట్టడాలు కూల్చివేయాలని ఆదేశాలు
- ప్రభుత్వ భూముల చుట్టూ ఫెన్సింగ్‌కు ఏర్పాట్లు

కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని 57వ డివిజన్‌లో స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్ భర్త ముస్తాఫా ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నాడు. ఆ ప్రాంతంలో పాఠశాల, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసమని గత కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురైన విషయాన్ని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పత్రికల ద్వారా వెలుగులోకి తెచ్చారు. దీంతో అధికారులు స్పందించి శనివారం ఆ స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన అధికారులు ఆ స్థలంలోని కట్టడాలను కూల్చేయాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలో ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

- ఖమ్మం, మార్చి 1

ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముస్తాఫా కబ్జా చేసి విక్రయించిన స్థలాలను పరిశీలిస్తున్న ఖమ్మం ఆర్డీవో, అర్బన్ తహసీల్దార్ తదితరులు

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్‌లో గల పాఠశాల, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గత కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్ భర్త ముస్తాఫా కబ్జా చేసి ప్లాట్‌లుగా చేసి విక్రయిస్తున్నాడు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు వెలుగులోకి తేవడంతో శనివారం రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. సర్వే నెంబర్ 64లోని ప్రభుత్వ స్థలాలను ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి నర్సింహారావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ వహీద్ పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో బేస్‌మెంట్ కట్టడాన్ని గుర్తించిన ఆర్డీవో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులతో మాట్లాడారు. వెంటనే అక్రమ కట్టడాలను కూల్చివేసి సంబంధిత మెటీరియల్‌ను డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలని చూస్తే ఎంతటి వారైనా సహించమని హెచ్చరించారు. అక్రమ కట్టడాలను కూల్చివేయాలని కార్పొరేషన్ అధికారులను కోరినట్లు తహసీల్దార్ తెలిపారు.

వెలుగులోకి తెచ్చిన పగడాల నాగరాజు

57వ డివిజన్ పరిధి రమణగుట్ట ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో సర్వే నెంబర్ 64లో ప్రాథమిక పాఠశాల నిర్మాణం కోసమని 7 గుంటల భూమిని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసమని 6 గుంటల భూమిని కేటాయించారు. ఆ స్థలాన్ని ఖమ్మం మున్సిపాలిటీకి అప్పగించారు. వీటికి సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణాలకు సైతం ప్లాన్‌లు తయారు చేశారు.. కానీ నిధులలేమి కారణంగా అప్పట్లో ఆయా నిర్మాణాలు జరగలేదు. ఆ సమయంలో ఆ డివిజన్ కార్పొరేటర్‌గా ప్రస్తుత బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఉన్నారు. ఆయన చొరవతోనే గత ప్రభుత్వం ఆయా స్థలాలను పాఠశాల, కమ్యూనిటీ హాల్‌కు కేటాయించడం జరిగింది. ఆ భూముల్లో ప్రస్తుత స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్ భర్త ముస్తాఫా గత నెల రోజుల నుంచి జేసీబీల సహాయంతో క్లీన్ చేసి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నాడు. అదేవిధంగా అదే ప్రాంతంలో గతంలో గ్రేవీ యార్డు కోసం 2 ఎకరాల భూమిని గత కేసీఆర్ ప్రభుత్వం కేటాయించింది. యార్డు నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు సైతం మంజూరయ్యాయి. ఐతే ఆ ప్రాంతంలో నాగార్జునసాగర్ కాలువ ఉండటం వల్ల యార్డు నిర్మాణానికి అడ్డంకిగా ఉండటంతో ఆ నిధులను రమణగుట్టకు వెళ్లే 60 అడుగుల ప్రధాన రోడ్డు నిర్మాణానికి కేటాయించారు. ఆ భూమిని సైతం ముస్తాఫా ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్న విషయాన్ని నాగరాజు శుక్రవారం పత్రికల ద్వారా వెలుగులోకి తెచ్చారు. ముస్తాఫా ఆగడాలకు అంతులేకుండా పోయాయని, విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానని లక్షల రూపాయలు పేదల నుంచి వసూలు చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులే తనకు చెబుతున్నారని నాగరాజు ఆరోపించారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని గతంలో డబ్బులు వసూలు చేసిన వారికి సంబంధిత స్థలాల్లో ప్లాట్లు ఇస్తున్నాడని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు శనివారం ఆయా స్థలాలను పరిశీలించారు. అక్రమ కట్టడాలను కూల్చివేసి ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

రాత్రికి రాత్రే ఆక్రమిస్తున్నాడు..

గత ఎన్నికల్లో ముస్తాఫా భార్య గెలుపు కోసం ఎంతో కష్టపడి పనిచేశా.. ముస్తాఫా అన్యాయంగా ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే చదును చేసి అమ్ముకుంటున్నాడు. ఇదే విషయం కలెక్టర్, తహసీల్దార్‌కు విన్నవించాం. ఈ ప్రాంతంలో బడి లేదు. 22 ఏండ్ల నుంచి అంగన్‌వాడీ సెంటర్ అద్దె భవనంలో నడుస్తున్నది. ప్రభుత్వ భూములను వీటి కోసం కేటాయిస్తే బాగుంటుంది. ముస్తాఫా వల్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తున్నది. అధికారులు విచారించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలి.

– గొట్టెపర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ కార్యకర్త, 57వ డివిజన్, ఖమ్మం

ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేయాలి

ఖమ్మం నగరంలోని 57వ డివిజన్‌లో గల ప్రభుత్వ భూములన్నింటికీ అధికారులు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడి ప్రజల అవసరాలను తీర్చడానికి ఉపయోగించాలి. కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఉద్యోగాలు ఇప్పిస్తామని, విద్యుత్ మీటర్లు ఇప్పిస్తామని పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారినుంచి పేదలను ప్రభుత్వమే కాపాడాలి.

– పగడాల నాగరాజు, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు. ఖమ్మం 57వ డివిజన్ పరిధి రమణగుట్ట ప్రాంతంలోని సర్వే నెంబర్ 64లో ప్రభుత్వ భూములను శనివారం పరిశీలించాం. అందులో నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలని అధికారులను ఆదేశించాం. ఆ భూముల చుట్టూ త్వరలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. దళారుల మాటలు నమ్మి ప్రభుత్వ భూములను కొని ఎవరూ మోసపోవద్దు.

– జి.నర్సింహారావు, ఖమ్మం, ఆర్డీవో

రేపే ఓట్ల లెక్కింపు

- ఉదయం 8 గంటలకు షురూ..
- ఒక కౌంటింగ్ హాల్.. 25 లెక్కింపు టేబుళ్లు
- ముందుగా 8 రౌండ్లలో బండిల్స్ ప్రక్రియ
- తర్వాతే తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఒకే రౌండ్‌లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి
- ఫలితం తేలకుంటే రెండో ప్రాధాన్యత కౌంట్
- చివరి నుంచి ఎలిమినేషన్ పద్ధతిలో ప్రక్రియ

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. నల్లగొండలోని ఐటీ హబ్ వెనకాల ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ గోదాంల్లో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా మండలి ఓట్ల లెక్కింపు ప్రక్రియ భిన్నంగా కొనసాగనుంది. ఓటింగ్‌లో ప్రాధాన్యతా ప్రకారం ఓటర్లు ఓటు వేయగా.. కౌంటింగ్ కూడా అదే విధంగా చేపడతారు. ముందుగా పోలైన బ్యాలెట్లన్నింటినీ కట్టలుగా కట్టి తర్వాత తొలి ప్రాధాన్యత ఓట్లను మొదలు లెక్కిస్తారు. ఆ సమయంలోనే చెల్లని ఓట్లను పక్కకు వేస్తారు. చెల్లిన ఓట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ విజేతకు అవసరమైన కోటాను నిర్ణయిస్తారు. చెల్లిన ఓట్లల్లో యాభై శాతం ప్లస్ ఒకటి కలిపి విజేతకు అవసరమైన గెలుపు కోటాను నిర్ధారిస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్లలోనే ఈ గెలుపు కోటాను అభ్యర్థులు సాధిస్తే సరేసరి. లేకుంటే ఎలిమినేషన్ పద్ధతిలో సుదీర్ఘంగా గెలుపు కోటా వచ్చే వరకు లెక్కింపు కొనసాగనుంది.

ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు షురూ..

ఓట్ల లెక్కింపు సరిగ్గా రేపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుంది. సోమవారం ఉదయం 6 గంటలకే ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లు అంతా లెక్కింపు కేంద్రానికి చేరుకోనున్నారు. వీరి సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేసి సీరియల్ ప్రకారంగా కౌంటింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్స్‌లను తరలిస్తారు. అయితే ఓట్ల సంఖ్య తక్కువగానే ఉండడంతో ఒకే కౌంటింగ్ హాల్‌ను సిద్ధం చేశారు. ఇందులో ఓట్ల లెక్కింపు కోసం 25 కౌంటింగ్ టేబుళ్లను, ఒక రిటర్నింగ్ అధికారి టేబుల్‌ను ఏర్పాటు చేశారు.

8 రౌండ్స్‌లో బండిల్స్ ప్రోగ్రాం..

మొత్తం 200 పోలింగ్ కేంద్రాల్లో కేంద్రానికి ఒక బ్యాలెట్ బాక్స్ లెక్కన మొత్తం 200 బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ కోసం వినియోగించారు. అయితే వీటిని పోలింగ్ కేంద్రాల సీరియల్ నెంబర్ ప్రకారంగా ఒక్కో కౌంటింగ్ టేబుల్‌కు ఒక బ్యాలెట్ బాక్స్‌ను అందజేస్తారు. ఇలా ఒక్కో రౌండ్‌లో 25 టేబుళ్లపై 25 బ్యాలెట్ బాక్స్‌లకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కడతారు. ఇలా ఒక్కో రౌండ్‌లో 25 అంటే.. మొత్తం 200 బాక్స్‌లు పూర్తి కావాలంటే 8 రౌండ్లలో కట్టలు కట్టే కార్యక్రమం కొనసాగనుంది. ఎప్పటికప్పుడు వీటిన్నింటినీ తీసుకెళ్లి ఆర్ఓ టేబుల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రమ్‌లో వేస్తారు. ఇలా బండిల్ కార్యక్రమం మొత్తం పూర్తయ్యాక అసలు ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. అయితే బండిల్ కార్యక్రమానికే కనీసం మూడు గంటల సమయం పట్టవచ్చని అంచనా. ఉదయం 11 గంటల వరకు ఇది పూర్తైతే ఆ తర్వాతే అసలు ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. తొలి ప్రాధాన్యత ఓట్లను ముందుగా లెక్కిస్తారు.

ఒకే రౌండ్‌లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు

అనుకున్న విధంగా ఉదయం 11 గంటల వరకు కట్టలు కట్టే ప్రక్రియ ముగిస్తే.. తర్వాత తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపడతారు. అయితే ఒక్కో టేబుల్‌కు 40 బండిల్స్ చొప్పున ఇస్తూ వెయ్యి ఓట్లను లెక్కిస్తారు. ఇలా మొత్తం 25 టేబుళ్లపై ఒక్క రౌండ్‌లోనే పోలైన 24,139 ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇదే సమయంలో చెల్లని ఓట్లను సైతం పక్కన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేస్తారు. ఇలా ఇది పూర్తి కావడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం తీసుకోవచ్చని అంచనా. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సాయంత్రం 5 గంటల వరకు పూర్తి కావచ్చు. ఇది పూర్తయ్యాక చెల్లని ఓట్ల లెక్క తేల్చి మొత్తం చెల్లిన ఓట్లలో 50 శాతం+1ను గెలుపు కోటాగా నిర్ధారిస్తారు. ఉదాహరణకు.. మొత్తం ఓట్లలో 24 వేల ఓట్లు చెల్లుబాటైతే.. అందులో సగం అంటే 12,000+1=12,001 ఓట్లు వచ్చిన అభ్యర్థి విజేతగా నిలుస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికి గెలుపు కోటా రాకపోతే అప్పుడు ఎలిమినేషన్ ప్రక్రియ మొదలవుతుంది.

తొలి ప్రాధాన్యతా ఓట్లతో విజేత తేలకుంటే..

ఎలిమినేషన్ ప్రక్రియలో విభిన్నంగా కొనసాగనుంది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించే సమయంలో పోటీ చేసిన అభ్యర్థుల్లో ఎవరికైతే తక్కువ తొలి ప్రాధాన్యతా ఓట్లు వస్తాయో.. వారి ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లను ముందుగా లెక్కించి ఆ అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తారు. తొలి ఓట్లలో చివరి స్థానంలో నిలిచిన అభ్యర్థికి పోలైన ద్వితీయ ఓట్లు.. ఏ అభ్యర్థులు పొందినవి వారికి కేటాయిస్తారు. ఇంకా కూడా కోటా రాకపోతే చివరికి తక్కువ తొలి ప్రాధాన్యత వచ్చిన రెండో అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను పరిగణనలోకి తీసుకుని మిగతా వారికి పంచేస్తారు. ఆయా అభ్యర్థుల తొలి ప్రాధాన్యత ఓట్లకు ఎలిమినేషన్ ప్రక్రియలో వస్తున్న ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కులుపుకుంటూ ముందుకు వెళతారు. మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో గెలుపు కోటా వచ్చే వరకు కింది నుంచి పైకి అందరి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తూ వెళ్తారు. ఈ క్రమంలో ఎక్కడైనా ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడితో కౌంటింగ్‌ను నిలిపివేసి విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ ఇక్కడ కూడా ఫలితం తేలకపోతే తృతీయ ప్రాధాన్యతా ఓట్లను కూడా లెక్కించక తప్పదు. అయితే కిందటి సారి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి గెలుపు కోటా ఓట్లకు కేవలం 38 ఓట్ల దూరంలో నిలిచిపోయారు. దీంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో తుది ఫలితం వెల్లడైంది.

నువ్వానేనా అన్నట్లు పోరు

అయితే ఈ సారి ఫలితం తేలడానికి ఎక్కువ సమయమే తీసుకోవచ్చని అంచనా. ప్రధాన అభ్యర్థుల్లో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డి, టీచర్స్ జాక్ అభ్యర్థి పూల రవీందర్, బీజేపీ అభ్యర్థి సర్వోత్తంరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ సుందరరాజులు తమకు భారీగానే ఓట్లు పోలైనట్లు అంచనా వేస్తూ విజయంపై ధీమాను ప్రదర్శిస్తున్నారు. నిజంగానే వీరి అంచనా ప్రకారం ఓట్లు వీరికి పోటాపోటీగా పోలైతే ఫలితం అంత ఈజీగా తేలకపోవచ్చు. అంటే ఎవరికీ కూడా గెలుపు కోటా చేరుకోవడం అంత సులభం కాకపోవచ్చు. మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో ఎలిమినేషన్ రౌండ్ కూడా సుదీర్ఘంగా కొనసాగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ ఆరుగురిలో నలుగురు అభ్యర్థులను ఎలిమినేషన్ చేస్తే తప్ప తుది ఫలితం వెల్లడికాకపోవచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఇదే జరిగితే తుది ఫలితం వెలువడే సరికి సోమవారం రాత్రి కావచ్చని కూడా భావిస్తున్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన జీఎం

అప్పారావుపేట ఫ్యాక్టరీలో పనులు పరిశీలిస్తున్న ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి

దమ్మపేట, మార్చి 1 : అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి శనివారం సందర్శించారు. పామాయిల్ ఫ్యాక్టరీలో ప్రస్తుతం జరుగుతున్న మెయింటెనెన్స్ పనులు, సివిల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ షట్‌డౌన్‌లో ఉన్నందున చేపట్టిన పనుల పురోగతి గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్‌లో ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా చేపట్టిన పనుల పరిస్థితిని తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్, సిబ్బంది ఉన్నారు.